క్లుప్తంగా

వైభవంగా తీర్థ మహోత్సవం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెనుమంట్ర: గ్రామంలోని శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం, శ్రీ సీతారాముల తెప్పోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. 60 ఏళ్లుగా ఆనవాయితీగా జరుగుతున్న తీర్థ మహోత్సవానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. తీర్థం సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిస్నానం, కుంకుమార్చనలు, మహా నివేదనలు నిర్వహించారు. అలాగే ఊర చెరువులో శ్రీ సీతారాముల తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

అపార్ట్‌మెంట్‌కు ఫోకస్ లైట్ ఏర్పాటుకు చర్యలు



మహిళలతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ప్రతి అపార్టుమెంట్‌కి ఒక ఫోకస్ లైట్ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్ మునిసిపల్ అధికారులకు ఆదేశాలిచ్చారు. బుధవారం టిడ్కో గృహాల్లో నివసిస్తున్న ప్రజల సమస్యలను శ్రీనివాస్ స్వయంగా తెలుసుకున్నారు. వీధిలైట్లు ఏర్పాటు చేయడం వల్ల హైటెన్షన్ వచ్చి లైట్లు మాడిపోతున్నాయని మునిసిపల్ అధికారులు శ్రీనివాస్ దృష్టికి తీసుకురావడంతో ఫోకస్ లైట్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అపార్టుమెంట్‌ల మధ్యలో భారీగా పెరిగిపోయిన చెట్లు, తుప్పలు తొలగింపునకు మునిసిపల్ నిధులతో మెషీన్ కొనుగోలు చేయాలని శ్రీనివాస్ ఆదేశాలిచ్చారు. అలాగే ప్రస్తుతం ఎంట్రన్స్ గేట్ మూసివేసి రెండో గేటులో నుంచి రాకపోకలు సాగించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో మరో 2 వేల మందికి టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ చురుగ్గా సాగుతోందన్నారు. ఎల్‌అండ్‌టీ జీఎం యోగానంద్, మునిసిపల్ కమిషనర్ ఆచారి, మునిసిపల్ డీఈ సాంబశివుడు, వైఎస్సార్ సీపీ పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, పార్టీ నాయకులు కోట రత్నరాజు, గేదెల నరసింహారావు, మన్సూర్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

వానరానికి ఊపిరిపోసిన ఫైర్ సిబ్బంది



డ్రైయిన్‌లో ఇరుక్కుపోయిన వానరానికి మత్తు ఇంజెక్షన్ ఇస్తున్న వెటర్నరి వైద్యులు

పాలకొల్లు సెంట్రల్: ఎరక్కపోయి ఇరుక్కుపోయిన వానరాన్ని స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. స్థానిక యడ్ల బజారు సెంటర్ గొర్రెల వారి వీధిలో బుధవారం ఓ వానరం భవనంపై దూకుతూ కింద పడిపోయింది. తలకు చిన్న గాయం కావడంతో అలా నెమ్మదిగా నడుస్తూ ఓ సందులో నుంచి వెళుతూ డ్రెయినేజీలో తల దూర్చింది. అంతే అక్కడ వేస్ట్ వాటర్ పైపు ఉండడంతో డ్రెయిన్‌కు పైపుకు మధ్యలో ఇరుక్కుపోయింది. దానిదీన పరిస్థితిని చూసిన స్థానికులు కోతిని లాగడానికి ప్రయత్నం చేశారు. కానీ అది బయటకు వస్తే కరుస్తుందేమోననే భయంతో దానిని బయటకు తీయలేకపోయారు. ఇంతలో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు కూడా వానరం బయటకు వస్తే ఎవరిపై దూకుతుందో ఎవరిని రక్కుతుందో అనే అనుమానంతో పశుసంవర్ధక శాఖ వైద్యుల దృష్టికి సమాచారం అందించారు. వెటర్నరీ డాక్టర్ రామశేఖర్ సిబ్బంది వచ్చి ముందుగా కోతికి మత్తు ఇంజక్షన్ ఇచ్చారు. అది నెమ్మదిగా మత్తులోకి జారుకున్న తరువాత ఫైర్ సిబ్బంది, వీరికి తోడుగా సొసైటీ ప్రివెన్షన్ యానిమల్ క్రుయాలిటీ (ఎస్‌పీసీఏ) సంస్థ సభ్యులు కలిసి కోతిని నెమ్మదిగా బయటకు లాగి రోడ్డుపై పడుకోబెట్టారు. మత్తు మందు నుంచి తేరుకున్న కోతికి ఎస్‌పీసీఏ సభ్యులు మరిన్ని పరీక్షలు నిర్వహించి దానికి ఆహారం పెట్టారు. కాసేపటికి ఆ వానరం నెమ్మదిగా అక్కడి నుంచి వెళ్లిపోయింది.

మోటారు సైక్లిస్టుకు గాయాలు

ఆకివీడు: మోటారు సైకిల్‌పై వెళ్తున్న మంగళంపాటి రవిచంద్రను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై కె.రాజారెడ్డి బుధవారం తెలిపారు. గత నెల 31న సినిమా చూసి ఇంటికి వెళ్లుతున్న రవి చంద్రను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో, అనంతరం గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు పేర్కొన్నారు. అక్కడ నుంచి బాధితుడి తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- నరసాపురం మున్సిపాలిటీలో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్
- రూ.61.81 కోట్లుతో మంచినీటి పైప్‌లైన్స్ ప్రక్షాళన
- అదనంగా మరో 4 ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం



భారీ విస్తీర్ణంలో ఉన్న నరసాపురం మంచినీటి కుళాయిచెరువు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో పాత పైప్‌లైన్‌లను పూర్తిగా ఆధునికీకరించడంతో పాటుగా అదనంగా ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం చేపట్టే పనులు ఈ ఏడాదిలోనే ప్రారంభించడానికి అధికారులు సమాయాత్తమవుతున్నారు. మున్సిపాలిటీలో రూ.61.81కోట్లుతో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్టను గత ఏడాది నవంబర్‌లో ప్రభుత్వం మంజూరు చేసింది. దీనికి సంబంధించి సాంకేతిక అనుమతులు ఇస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఇప్పటికే జీఓ నెంబర్ 15 విడుదల చేసింది. ప్రాజెక్ట్‌లో భాగంగా ముందుగా చినమామిడిపల్లిలో ఓహెచ్‌ఆర్ నిర్మించాలని నిర్ణయించారు. మరికొన్ని రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి. ప్రాజెక్ట్ పూర్తయితే దాదాపు 45 ఏళ్ల దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం లభించనుంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పట్టణంలో 70 ఎకరాల భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువుంది. మంచినీటి చెరువులో ఎప్పుడూ 586 మిలియన్ లీటర్ల నీరు అందుబాటులో ఉంటుంది. మంచినీటి సరఫరాకు మూడు రిజర్వాయర్లు ఉన్నాయి. 60 వేల జనాభా ఉన్న పట్టణంలో 8,760 గృహ కుళాయి కనెక్షన్లు, 120 పబ్లిక్ కుళాయిలు, 596 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి.

పైప్‌లైన్స్ శిథిలం కావడం వల్లే

మునిసిపల్ లెక్కల ప్రకారం చూసుకుంటే చెరువులో అందుబాటులో ఉన్న నీటిని వేసవిలో కాలువలు కట్టేసినా కూడా ఏ ఇబ్బందిలేకుండా రెండు పూటలా అందించవచ్చు. కానీ కుళాయిల ద్వారా సమృద్ధిగా నీళ్లు అందని పరిస్థితి. అయితే అసలు చిక్కంతా పైప్‌లైన్స్ శిథిలం కావడం వల్లే వస్తోంది. పైప్‌లైన్లు బాగోలేక పోవడంతో తక్కువ ప్రెజర్‌తో నీటిని వదులుతారు. దీంతో కుళాయిల ద్వారా నీళ్ళు సవ్యంగా రావు. ఒకవేళ ఎక్కువ ప్రెజర్‌తో నీటిని వదిలితే పైప్‌లైన్స్‌కు ఇంకా పెద్ద సంఖ్యలో లీకేజీలు ఏర్పడే పరిస్థితి ఉంది. పైప్‌లైన్‌ల లీకేజీలు కారణంగా రాయిపేట, రుస్తుంబాధ, స్టేషన్‌పేట, చినమామిడిపల్లి, వీవర్స్‌కాలనీ, వైఎస్సార్ నగర్, నందమూరికాలనీ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నెలకొంటుంది. శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పొన్నపల్లి, మాధవాయిపాలెం, చిమామిడిపల్లి ఓఎన్జీసీ కాలనీ, జవదాలవారిపేట, లాకుపేట ప్రాంతాల్లో నీటి కొరత. ఇది దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్య. 1956లో మున్సిపాలిటీ ఏర్పడింది. 45 ఏళ్ల క్రితం నిర్మించిన పైప్‌లైన్‌లను ఆధునికీకరించాలనే ఆలోచన గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో ఇప్పటికి మంచినీటి సరఫరా మెరుగుదలకు స్పెషల్ ప్రాజెక్ట్ మంజూరు సాధ్యమైంది.

ప్రాజెక్ట్ స్వరూపం ఇది....

పట్టణంలో ప్రస్తుతం 3 ఓహెచ్‌ఆర్‌లు ఉన్నాయి. స్పెషల్ ప్రాజెక్ట్‌లో భాగంగా మరో నాలుగు ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం 96 కిలో మీటర్లు మేర పైప్‌లైన్‌లు ఉన్నాయి. వీటిలో 40 కిలో మీటర్లు మేర పైప్‌లైన్‌లు పూర్వం ఎప్పుడో వేసినవే. వాటిని పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తారు. దీనికి తోడుగా కొత్తగా దాదాపు మరో 30 కిలోమీటర్లు మేర శివారు ప్రాంతాలకు పైప్‌లైన్‌లు నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న నీటిశుద్ధి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తారు.

మంచినీటి సరఫరాలో ఇబ్బందులు ఉండవు



నరసాపురంలో భారీ విస్తీర్ణంలో మంచి నీటి చెరువు ఉంది. కానీ పైప్‌లైన్స్ వల్లే ఇబ్బందులు ఉన్నాయి. రూ.61.81 కోట్లుతో పట్టణంలో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ మంజూరుకు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు చొరవ చూపించారు. చాలా ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్‌లు వేస్తారు. ఇక ప్రతీ వేసవిలో కూడా నీటి ఇబ్బంది అనేది ఉండదు. త్వరలో పనులు ప్రారంభంకాబోతున్నాయి.

–బర్రి శ్రీవెంకటరమణ
మునిసిపల్ చైర్‌పర్సన్

నీతి ఎన్నటికీ గెలుస్తూనే ఉంటుంది



పెనుమంట్రలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి

పెనుమంట్ర: నీతివంతమైన పాలన అందించే వారు ఎప్పటికీ గెలుస్తూనే ఉంటారని, అదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విషయంలో నిజమవుతుందని ఏపీ శాప్ చైర్మన్ బైర్రెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. బుధవారం పెనుమంట్రలో కనకదుర్గమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం, శ్రీ సీతారాముల తెప్పోత్సవంలో పాల్గొన్నారు. తొలుత ఆచంట నియోజకవర్గంలో పెనుమంట్ర మండలం ఎస్ ఇల్లింద్ర పర్రు చేరుకొని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఇల్లిందపర్రు, మల్లిపూడిల్లో పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు అన్నీ భారీ ర్యాలీగా పెనుమంట్రకు బైర్రెడ్డి సిద్ధార్థరెడ్డిని తీసుకువచ్చారు. కార్యక్రమంలో రుడా చైర్‌పర్సన్, ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి, యోగా అసోషియేషన్ అధ్యక్షుడు చెరుకువాడ నరేష్ రాజు, ఏఎంసీ చైర్మన్ వెలగల వెంకట రమణ, ఎంపీపీ కేఎస్ నారాయణరెడ్డి(వాసు), జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి సుభాషిణి, పట్టణ అధ్యక్షుడు తేతలి సుధీర్ రెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తమనంపూడి సాయి నారాయణ రెడ్డి, కర్రి సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



పేరుపాలెంలో ఆసరా చెక్కును అందిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: మహిళలందరినీ లక్షాధికారులను చేయడంతో పాటు మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం పేరుపాలెం సౌత్ 2 సచివాలయాల పరిధిలోని పేరుపాలెం సౌత్, నార్త్, కేపీ పాలెం నార్త్, సౌత్, మోడి గ్రామాలకు సంబంధించి 513 గ్రూపులకు రూ.6.40 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మూడు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకాన్ని అందించామన్నారు. మండలంలోని 1566 గ్రూపులకు రూ.17.12 కోట్లను డ్వాక్రా మహిళల ఖాతాలో జయ చేశామన్నారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అందే సూర్యావతి, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజి, వైస్ ఎంపీపీ కవురు సీతామహలక్ష్మి, సర్పంచ్‌లు తిరుమాని విజయలక్ష్మి, పేరుపాలెం వెంకన్న, కడలి సోంబాబు, అందే వెంకటలక్ష్మి, మారెళ్ళ మాధవి, ఎంపీటీసీ సభ్యులు ఆండ్రాజు షరాబంద్ రాజు, మేళం బాల రమ్య, కొమ్మూరి సూరయ్య నాయుడు, డీఎస్‌వి సత్యనారాయణ, తిరుమాని వరలక్ష్మి,దొంగ వీర వెంకట సత్యనారాయణ, నాయకులు కర్రి ఏసు బాబు, అందే భుజంగరావు, ఆండ్రాజు చల్లారావు, కొల్లాబత్తుల రవికుమార్, కటికల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన లేసు డిజైన్లపై దృష్టి సారించాలి



లేసుపార్కులో మహిళలతో మాట్లాడుతున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, చీఫ్‌విప్ ప్రసాదరాజు, జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం రూరల్: మారుతున్న కాలం వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా లేసు ఉత్పత్తుల తయారీకి నాంది పలకాలని ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (పీఆర్ అండ్ ఆర్డీ) బి.రాజశేఖర్ అన్నారు. బుధవారం రుస్తుంబాద లేసుపార్కు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో నరసాపురం లేసు ఉత్పత్తులకు గుర్తింపు ఉందన్నారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్తకొత్త డిజైన్లతో లేసు ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ఎంతో గొప్ప చరిత్ర కలిగి ఒకప్పుడు ఎంతో వైభవంగా వర్ధిల్లిన లేసు పార్కును గత ప్రభుత్వంలో ప్రైవేటువారి భాగస్వామ్యంతో పూర్తిగా దుర్వినియోగం చేశారన్నారు. కోట్లాది రూపాయలతో గతంలో లేసుపార్కును అభివృద్ధి చేసి తీర్చిదిద్దామన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ లేసు ఉత్పత్తులకు ఫ్లిప్‌కార్ట్ ద్వారా ఆన్‌లైన్ షాపింగ్‌లో మార్కెటింగ్ చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులతో స్థానిక లేసు అల్లికా మహిళలకు శిక్షణను ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తొలుత ఇటీవల ఆధునికీకరించిన లేసు పార్కును స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈవో ఇంతియాజ్, సబ్ కలెక్టర్ సూర్యతేజ, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, కె శ్రీనివాస్, జిల్లా పంచాయతీల అధికారి నాగలత, డ్వామా పీడీ రాజేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 3 రోజుల్లో వేతనాలు

నరసాపురం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలకు చేసిన పనికి మూడు రోజుల వ్యవధిలోనే వేతనాలు వారి ఖాతాలో జమ చేయాలని పీఆర్ అండ్ ఆర్డీ స్టేట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పథకం రికార్డులను, మస్తరు నమోదు, వేతనాల చెల్లింపు ప్రక్రియ తదితర అంశాలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ఆపరేటర్, అకౌంట్ అసిస్టెంట్ దివి రంగనాయకులు, టెక్నికల్ అసిస్టెంట్ కోట బాబూరావులను రాజశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్‌లో పనిచేసే ఏపీఓలకు ఇటీవల గ్రేడ్‌లు నిర్ణయించిన మాదిరిగానే ఇదే శాఖలో పనిచేస్తున్న సీవో, టీఏలకు కూడా గ్రేడ్‌లను ఫిక్స్ చేసి జీతాలు చెల్లించేలని కోరుతూ ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు డి.రంగనాయకులు, కార్యదర్శి ఒమెగారాజు తదితరులు స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్‌కు వినతి పత్రాన్ని అందించారు.

‘జగనన్నే మా భవిష్యత్’ పోస్టర్ల ఆవిష్కరణ



పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌లో పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



తూర్పుపాలెంలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు వెళ్లి వారి స్పందనను స్వయంగా తెలుసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌లో బుధవారం జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, కోఆప్షన్ మెంబర్ తండా ఇస్సాక్‌రాజు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, మద్దా చంద్రకళ, పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్ర భవిష్యత్

పెనుగొండ: రాష్ట్రంలో పేదల భవిష్యత్తు సీఎం జగన్‌తోనే ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లోనూ మరింత సంక్షేమం అమలు చేయడానికి పేదలు అందరూ సీఎం జగన్ మా భవిష్యత్ అంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పుత్తినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, అత్తిలి ఏఎంసీ మాజీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, పెనుగొండ ఏఎంసీ డైరక్టరు గండ్రేటి అప్పారావు, ఏసురత్నం, కర్రి వేణుబాబు, మేడిచర్ల పండు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



మునమర్రులో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పాలకొల్లులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పెనుగొండ: భారతదేశంలో హరిత విప్లవాన్ని తీసుకువచ్చి రైతులకు అండగా నిలిచి అధిక ఆదాయాన్ని సమకూర్చిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు కొనియాడారు. పెనుగొండ మండలం మునమర్రులో, ఆచంట మండలంలో కరుగోరుమిల్లిలో బుధవారం డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణల్లోనూ, సిద్ధాంతం, కొడమంచిలి, నడిపూడిల్లో జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీపీలు పుతినీడి వెంకటేశ్వరరావు, కేవీనారాయణ రెడ్డి (వాసు), దిగమర్తి సూర్యకుమారి, జడ్పీటీసీలు పోడూరి గోవర్ధన, కర్రి గౌరీ సుభాషిణీ, ఉప్పలపాటి సురేష్ బాబు, పెనుగొండ ఏఎంసీ వైస్ చైర్మన్ తానేటి నాగ మల్లేశ్వరరావులు, మండలసర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, దండు పద్మావతిలు పాల్గొన్నారు. పెనుగొండలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, సర్పంచ్ నక్కా శ్యామలా సోనీలు నివాళులర్పించగా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు నలిమిల్లి బాబిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్, పలివెల శ్రీనులు పాల్గొన్నారు. సిద్ధాంతంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు, ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతిలు, ఎస్వీకేపీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు నివాళులర్పించారు. ఆచంట పంచాయతీ వద్ద, పెదపేటలోనూ డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళలర్పించారు. సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు తప్పెట్ల విజయకుమారి పాల్గొన్నారు. కొడమంచిలిలో నిర్వహించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో పాటు, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేడుల సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: దళిత, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికార ఫలాలు అందాలని అనేక సంస్కరణలు అమలు చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని జిల్లా పరిషత్ చైర్మన్, కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో బుధవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, మండల కోఆప్షన్ సభ్యుడు తండా ఇస్సాక్‌రాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవల్లి వాసు, వైసీపీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, గృహసారథుల పట్టణ, మండల కన్వీనర్లు ఎంఎస్ వాసు, పార్శి వెంకటరత్నం, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు పాల్గొన్నారు. అలాగే లంకలకోడేరు అరుంధతీపేట వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యాళ్లవానిగరువు సచివాలయ ఆవరణలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: స్థానిక అబ్రహం పేటలో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు పడవల సత్యనారాయణ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కోడెల్లి వెంకట్రావు,ఉల్లంపర్తి బులినర్సు, కుమార్ రాజు, చంటి తదితరులు పాల్గొన్నారు. కేపీ పాలెంలో కారుమించి జీవరత్నం, కొండేటి రామారావు ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు.

పాలకొల్లు టౌన్‌లో

పాలకొల్లు సెంట్రల్: స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం జగ్జీవనరామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్రపాటి వీరాస్వామి, పెదపాటి పెద్దిరాజు, దేవ రాజేష్ పాల్గొన్నారు. స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని జగ్జీవనరామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: దళితుల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రాం అని వైఎస్సార్ సేవాదళ్ మండల కన్వీనర్ దిద్దే శ్రీనివాస్ అన్నారు. కొమ్ముచిక్కాల గ్రామంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తానేటి సురేష్, ముప్పిడి సీతయ్య, సిద్దుల ప్రసాద్, తానేటి కర్నేలు, కడిమి కృష్ణ, కొండేటి ఎ.ప్రేమ్, నార్కిడిమిల్లి రవి కుమార్ పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ దళితనేత ముసూడి రత్నం అన్నారు. పట్టణంలోని అరుంధతిపేటలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వంగలపూడి ఏషయా, కేసీఆర్, ముసూడి రవి తదితరులు పాల్గొన్నారు.

యువకుల బైక్ రేసింగ్

తణుకు: పట్టణంలో బైక్ రేసింగ్‌లతో యువకులు రెచ్చిపోతున్నారు. బుధవారం రాత్రి కొందరు యువకులు బైక్ రేసింగ్ చేస్తూ ఆటోను తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. వేల్పూరు వైపు నుంచి కొందరు యువకులు స్పోర్ట్స్ బైక్‌లపై తణుకు వస్తున్నారు. ఈ క్రమంలో వేల్పూరు రోడ్డులోని భాష్యం స్కూలు వద్దకు వచ్చే సరికి ఒక బైకర్ ఆటోను తప్పించబోయి రోడ్డుపై పడి జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో సుమారు వంద మీటర్లు మేర బైక్ దూసుకెళ్లడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదే సమయంలో అటుగా వెళుతున్న వాహనదారులు, ప్రయాణికులు ఆగి మరీ యువకులకు చీవాట్లు పెట్టారు. ఇటీవలి కాలంలో ప్రధాన రోడ్ల వెంబడి ఈ తరహా బైక్ రేసింగ్‌లు నిర్వహిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పోలీసులు ఇలాంటి యువకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.